సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 7 । మే । 2025



ఖాకీలకు చెంపపెట్టు!
'ప్రజల మాన, ప్రాణ, ఆస్తులు కాపాడేందుకు రక్తాన్నైనా చిందిస్తాం'. ఇది ఒకప్పుడు పోలీసుల అంకితభావం. ఇప్పుడు పరిస్థితులు మారాయి. -8లో



దేవా.. దీవించవా.. !
'దేవా.. దీవించవా..మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని కాపాడవయ్యా..' అంటూ భక్తులు వేడుకున్నారు. బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. -8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
40.6/29.2
జిల్లాలో వమంగళవారం 29.2 - 40.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కడప రిమ్స్ ప్రిన్సిపాల్ బదిలీ



డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఏ.సురేఖ నంద్యాల ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. 2022 అక్టోబర్‌లో పూర్తి అదనపు బాధ్యతలతో రిమ్స్ ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరిన డాక్టర్ సురేఖ 2023 సెప్టెంబర్ నుంచి అడిషనల్ డీఎంఈ హోదాలో ప్రిన్సిపాల్‌గా సమర్థవంతంగా విధులను నిర్వహించారు. ఆమె స్థానంలో ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా, అడిషనల్ డీఎంఈ హోదాలో పనిచేస్తున్న డాక్టర్ టి.జమున కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

పౌర రక్షణకు పటిష్ట భద్రతా చర్యలు

కడప సెవెన్‌రోడ్స్/ అర్బన్: సివిల్ డిఫెన్స్ రూల్స్ -1968 లోని సెక్షన్ 19 కింద భారత ప్రభుత్వం నిర్దేశించిన జిల్లాల్లో పౌర రక్షణ మాక్ డ్రిల్, రిహార్సల్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని...ఈ మేరకు ఉత్తర్వులు అందాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణ జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రణాళిక ప్రకారం నిర్వ హించాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, వివిధ జిల్లా అధికారులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వలంటీర్లు, హోమ్ గార్డ్ (యాక్టివ్/రిజర్వ్ వాలంటీర్లు), ఎన్‌సీసీ కళాశాల, పాఠశాల విద్యార్థుల చురుకుగా పాల్గొనాలన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణతో దేశం చేపట్టే పౌర రక్షణ చర్యల కార్యాచరణ, సమర్థ త, సమన్వయాన్ని అంచనా వేయనున్నట్లు పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

వల్లూరు: పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు సమర్పించుకున్న కానుకలను కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. శాశ్వత హుండీల ద్వారా రూ.6,11,462 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా సేవా టికెట్ల ద్వారా రూ.69,750లు, అన్న దానం కోసం ఇచ్చిన చందాల ద్వారా రూ 78,285 వచ్చిందని, దీంతో మొత్తం కలిపి రూ 7,59,762 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. జిల్లా దేవదాయ శాఖ కమీషనర్ జీ మల్లికార్జున, అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బా రెడ్డి, ఆలయ అర్చకులు అఖిల్ దీక్షితులు భక్తులు పాల్గొన్నారు.

మదనపల్లెలో సీఐడీ అధికారులు

మదనపల్లె: మండల తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం సీఐడీ అధికారులు వచ్చారు. మదనపల్లె ఫైల్స్ కేసుకు సంబంధించి దర్యాప్తులో భాగంగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సీఐడీ డీఎస్పీ పద్మలత... తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ భరత్‌తో మాట్లాడారు. వలసపల్లె పంచాయతీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి వివరాలు కోరితే.. ఇప్పటి వరకు ఇవ్వకపోవడంపై ప్రశ్నించారు. అలాగే ఇతర రిపోర్ట్‌లు ఆలస్యం చేస్తున్నారని, కేసు దర్యాప్తులో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి వివరాలు ఇవ్వడంతో పాటు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తు పత్రాలను ఇవ్వాల్సిందిగా కోరారు.

గాలివాన బీభత్సం



కాకర్లవారిపల్లిలో నేలకొరిగిన బొప్పాయి చెట్లు

ఓబులవారిపల్లె: మండలంలో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో వాన పడింది. వర్షానికి తోడు విపరీతంగా గాలులు తోడు అయ్యాయి. దీంతో కాకర్లవారిపల్లి, బోటిమీదపల్లి, రాళ్ల చెరువుపల్లి తదితర గ్రామాల్లో బొప్పాయి, అరటి చెట్లు నేలకొరిగాయి. వందలాది ఎకరాలలో పంట నష్టం వాటిల్లింది. పంట చేతికందే సమయంలో గాలులకు నేలకు ఒరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అంతంత మాత్రాన ఉన్న మామిడి కాయలు గాలులకు రాలిపోయాయి.

అధికార దర్పం..
ఆక్రమణ పర్వం!

- రితీష్ అడుగులకు రెవెన్యూ మడుగులు!
- 2016లో ఆర్డీఓ, 2022లో జేసీ కోర్టులు ప్రభుత్వ భూమిగా తీర్పు
- ఆపై హైకోర్టు నుంచి స్టేటస్–కో తెచ్చుకున్న రితీష్‌రెడ్డి
- కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయని యంత్రాంగం
- కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమించుకుంటున్నా పట్టించుకోని వైనం



సాక్షి ప్రతినిధి, కడప: బద్వేల్ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జ్ కె.రితీష్‌రెడ్డి అడుగులకు రెవెన్యూ అధికారులు మడుగులొత్తుతున్నారు. ఆయన అవినీతి.. అక్రమాలకు ఎంచక్కా ద్వారాలు తెరిచి జీ హుజూర్ అంటూ ఆయన సేవలో తరిస్తున్నారు. వేలు లక్షలు కాదు..కోట్లాది రూపాయాల విలువైన ప్రభుత్వ భూమి దర్జాగా ఆక్రమించుకుంటుంటే నిద్ర మత్తులో జోగుతున్నారు. ఆర్డీఓ, జేసీ రెవెన్యూ కోర్టులు ప్రభుత్వ భూమిగా నిర్దేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చినా ఆ విషయాన్ని ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లకుండా నాన్చుతున్నారు.

- బి.కోడూరు మండలం వేముకుంట గ్రామంలో సర్వే నంబర్ 18లో 16.50 ఎకరాలు ప్రభుత్వ గయ్యాలి భూమిని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తన అనుచరుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న నేపథ్యంపై గ్రామస్తులు రెవెన్యూ కోర్టులను ఆశ్రయించారు. రాజంపేట ఆర్డీఓ కోర్టు (ఈ3)/1916/2016లో ద్వారా 2016లో ప్రభుత్వ గయ్యాలి భూమిగా తీర్పు ఇచ్చింది. ఆపై రితేష్‌రెడ్డి కడప జాయింట్ కలెక్టర్ కోర్టును ఆశ్రయించగా జేసీ కోర్టు సైతం ఆర్డీఓ కోర్టు తీర్పును సమ్మతిస్తూ ప్రభుత్వ గయ్యాలి భూమిగా డిసెంబర్ 23, 2022 తేదిన ఉత్తర్వులు ఇచ్చింది. ఆపై బి.కోడూరు తహశీల్దార్, వేముకుంట గ్రామస్తుల సమక్షంలో పంచనామా చేపట్టి, సర్వే నంబర్ 18లో 16.50ఎకరాలు భూమిని స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌ఓసీ సృష్టించి ఎలక్ట్రికల్ సర్వీసు...
ప్రభుత్వ భూమిగా అధికారులు, కోర్టులు స్పష్టంగా చెప్పిన సదరు భూమిని తాజాగా రితేష్‌రెడ్డి తప్పుడు ఎన్‌ఓసీ సృష్టించారు. తద్వారా ఎలక్ట్రికల్ సర్వీసు పొందారు. పైగా అక్కడ వ్యవసాయ బోరు లేకపోయినా ఎలక్ట్రికల్ సర్వీసు పొందడం మరో వింతగా స్థానికులు చెప్పుకొస్తున్నారు. మరోవైపు ఆ పొలంపై హైకోర్టు స్టేటస్–కో ఇచ్చింది. అంటే భూమి యథాస్థితిలో కొనసాగించాలి. అలా కాకుండా రితేష్‌రెడ్డి నేతృత్వంలో మొత్తం భూమి చదును చేసి, చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయడం గమనార్హం.

కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం...
ప్రభుత్వ భూమిగా ఆర్డీఓ, జేసీ కోర్టులు నిర్దేశించిన సదరు భూమిపై హైకోర్టు స్టేటస్–కో ఉత్తర్వులిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కోట్లాది రూపాయాలు విలువైన భూములను రెవెన్యూశాఖ దక్కించుకోవాల్సి ఉండగా టీడీపీ ఇన్‌ఛార్జీ రితేష్‌రెడ్డి అడుగులకు మడుగులొత్తుతూ అధికార మత్తులో జోగుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.3కోట్లు పైబడి పలికే ఆ ప్రభుత్వ గయ్యాలి భూమి రితేష్‌రెడ్డి ధారాదత్తం చేసేందుకు ఎలాంటి చర్యలకు ఉపక్రమించకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోస్టింగ్స్ కోసం రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నేతకు వంత పాడుతూ అండగా నిలుస్తున్నారని విశ్లేషకులు సైతం ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయమై బద్వేల్ ఆర్డీఓ చంద్రమౌళి వివరణ కోరగా తనకు విషయం తెలియదని, బి కోడూరు రెవెన్యూ అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేయడంపై సమాలోచనలు చేస్తామని చెప్పుకొచ్చారు.

నిరంతర విద్యుత్ సరఫరా జరగాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కూడా అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా విద్యుత్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని రానున్న రెండు నెలలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎలాంటి కొరత రాకుండా ప్రత్యేక, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కడప నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నా.. ఏవైనా అవసరం ఉన్నా ప్రతిపాదనలను అందజేసి.. త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. సూర్యఘర్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ గురించి మాట్లాడారు. ఇందులో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాకు సంబంధించి రూ. 465.03 కోట్లు కేటాయించగా, రూ. 279.03 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే.. స్మార్ట్ మీటర్ల ఇన్‌స్టాలేషన్‌కు గాను రూ.184.12 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో రైతులకు వ్యవసాయ అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో, ఇండ్లపైన - హైటెన్షన్ - 11 కేవీ 240 వోల్టుల విద్యుత్ లైన్ల తొలగింపునకు విద్యుత్ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలకు విద్యుత్ పరికరాలు గానీ, మౌలిక సదుపాయాలు గానీ, విద్యుత్ సరఫరాను లాభాపేక్ష లేకుండా చేపట్టాలన్నారు. రైతుల నుంచి విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అదనపు వసూళ్లకు పాల్పడకూడదని హెచ్చరించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది మాట్లాడుతూ ప్రతి అధికారి రైతులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ, ఏఈ లు, డీఈలు, జేఈలు అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విహార కేంద్రాలకు ప్రత్యేక సర్వీసులు

జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని పలు విహార కేంద్రాలతోపాటు పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులను నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఆర్ఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పుణ్యక్షేత్రాలైన వేళాంగిణి, షిర్డి, విహార ప్రాంతాలైన ఊటి, గోవాతదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. ఆయా బస్సుల ఏర్పాట్లపై ఆయా డిపో మేనేజర్లకు తగిన ఆదేశాలు జారీ చేశామని వివరించారు.

- జమ్మలమడుగు నుంచి ప్రతి సోమవారం పొలతలకు బస్సును నడుపుతున్నామన్నారు. అలాగే బ్రహ్మంగారిమఠంలోజరుగుతున్న ఆరాధన ఉత్సవాలకుగాను వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నామని వెల్లడించారు. మైదుకూరు నుంచి మఠానికి 54 బస్సులు, బద్వేలు నుంచి 22, మఠం నుంచి కాశినాయన క్షేత్రానికి 2 బస్సులను నడుపుతున్నామని వివరించారు.



11న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు
ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే వారి కోసం మే 11న ప్రత్యేక సర్వీసులు నడపనున్నటు గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి ఉదయం 6 గంటలకు గోల్డెన్ టెంపుల్ మీదుగా, రాత్రి 9 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా బస్సులు బయలుదేరుతుందన్నారు. బద్వేలు డిపో నుంచి ఉదయం 9 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుంది. మైదుకూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు , ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు సూపర్‌లగ్జరీ సర్వీసు నడుస్తుంది. పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసు ఉందన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి రెండు సర్వీసులు ఉన్నాయని.. ఒక బస్సు సాయంత్రం 6.00 గంటలకు మరో బస్సు రాత్రి 8 గంటలకు నడుస్తాయని వివరంచారు. ఇందులో ఛార్జీలు రూ. 1200 -1300ల మధ్య నిర్ణయించారని తెలిపారు.

రాయచోటి రాజకీయాల్లో
చెరగని ముద్ర



దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌తో సుగవాసి పాలకొండ్రాయుడు (ఫైల్)



దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డితో సుగవాసి పాలకొండ్రాయుడు

- తిరుగులేని నేతగా ఎదిగిన పాలకొండ్రాయుడు
- అభిమాన నాయకుడి మృతితో విషాద ఛాయలు



రాయచోటి: రాయచోటిలో రాజకీయాల్లో సుగవాసి పాలకొండ్రాయుడు చెరగని ముద్ర వేశారు. ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా పని చేసి.. సుదీర్ఘ రాజకీయ జీవితం కొనసాగించారు. అలాంటి అరుదైన నేత మృతితో.. రాయచోటిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు(86) మంగళవారం వేకువజామున కన్నుమూశారు. ఆయన రాయచోటిలో రాజకీయ శూన్యత నెలకొన్న సమయంలో.. అప్పటి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు, అభిమానుల పిలుపు మేరకు.. 1977లో రాజకీయ అరంగేట్రం చేశారు. ముక్కుసూటి నేతగా పేరు తెచ్చుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి రాజకీయ ప్రయాణం మొదలుపెట్టారు. నియోజకవర్గంలో బలమైన ప్రజానేతగా ఎదిగిన ఆయన ఒక పర్యాయం జనతా పార్టీ నుంచి, రెండో పర్యాయం స్వతంత్ర అభ్యర్థిగా రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత కాలంలో ఎన్‌టి రామారావు స్థాపించిన టీడీపీలోకి అడుగు పెట్టిన నాటి నుంచి.. నేటి వరకు అదే పార్టీలో సీనియర్ నేతగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సఖ్యతతో రాజకీయ ప్రస్థానం సాగింది. తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎత్తు పల్లాలు, ఒడిదిదుకులు ఎదుర్కొన్నారు. తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం పని చేసి తనదైన శైలిని కొనసాగించారు.

- 1978లో రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ స్థానం నుంచి తొలిసారిగా జనతా పార్టీ తరఫున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మహల్ హబీబుల్లాపై విజయం సాధించారు.
- 1983లో రాయచోటి నుంచి రెండవ సారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి దివంగత మాజీ ఎమ్మెల్యే మహల్ హబీబుల్లా సతీమణి మహల్ షవరున్నీసాపై జయకేతనం ఎగురవేశారు.
- టీడీపీ స్థాపన అనంతరం ఎన్‌టీఆర్ ఆహ్వానించడంతో సుగవాసి ఆ పార్టీలో చేరారు.
- 1984లో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఎ.సాయిప్రతాప్‌పై విజయం సాధించారు.
- 1989లో కాంగ్రెస్ అభ్యర్థి మండిపల్లి నాగిరెడ్డిపై పోటీ చేసి తొలి ఓటమిని చవిచూశారు.
- 1991లో రాజంపేట పార్లమెంట్ స్థానానికి ఎ.సాయిప్రతాప్‌పై పోటీ చేసి ఓటమిని చవిచూశారు.
- 1992లో అప్పటి ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి అనంతరం రాయచోటి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో.. మండిపల్లి నారాయణరెడ్డిపై పోటీ చేసి ఓటమి చెందారు.
- 1994లోనూ రాయచోటి అసెంబ్లీ స్థానానికి మండిపల్లి నారాయణరెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు.
- 1999లో రాయచోటి అసెంబ్లీ నుంచి మండిపల్లి నారాయణరెడ్డిపై సుగవాసి పాలకొండ్రాయుడు విజయం సాధించారు.
- 2004లో రాయచోటి నుంచి ప్రస్తుత మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరి మిన్నంరెడ్డి శ్రీలతరెడ్డిపైన విజయం సాధించారు.
- 2009లో రాయచోటి నుంచి గడికోట శ్రీకాంత్‌రెడ్డిపై పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఇవే ఆయనకు చివరి ఎన్నికలు. తర్వాత ప్రత్యక్ష ఎన్నికలలో పోటీకి దిగలేదు. ఆయన రాజకీయ వారసులుగా కుమారులు సుగవాసి సుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబు కొనసాగుతున్నారు. 31 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో 8 దఫాలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి నాలుగు సార్లు గెలుపొందారు. రాజంపేట పార్లమెంట్ స్థానానికి రెండు దఫాలు పోటీ చేసి ఒక సారి ఎంపీగా విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


సుబ్బరాయుడు (ఫైల్)

రాజుపాళెం : మండల పరిధిలోని వెంగళాయపల్లె గ్రామానికి చెందిన పారుమంచాల సుబ్బరాయుడు (37) అనే వ్యక్తి మంగళవారం అదృశ్యమయ్యాడు. రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు సుబ్బరాయుడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇప్పటివరకు తిరిగి రాలేదన్నారు. సుబ్బరాయుడు భార్య సుభాన్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. సుబ్బరాయుడుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్దిమడుగులో..


అదృశ్యమైన శాంతమ్మ

చింతకొమ్మదిన్నె : మండలంలోని మద్దిమడుగు సుగాలి బిడికి గ్రామానికి చెందిన బుక్కే శాంతమ్మ అనే మహిళ గతనెల 24వ తేదీన ఇంటి నుంచి కడపకు బస్సులో వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదని, ఆమె ఆచూకీ ఎవరికైనా తెలిస్తే బంధువులకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు తెలిపారు. అదృశ్యమైన మహిళకు చెవుడు, మాట్లాడలేదని, నాలుగు రోజుల క్రితం స్థానిక చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 7337431884, 9381935390, 8639205644 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

కొండాపురంలో..

కొండాపురం : మండల పరిధిలోని టి.కోడూరు గ్రామానికి చెందిన జి. బ్రహ్మేంద్ర అనే యువకుడు ఇంటిలో నుంచి వెళ్లి తిరిగి రాలేదని తాళ్ల ప్రొద్దుటూరు ఏఎస్ఐ ఆర్. బాసు తెలిపారు. యువకుడి తండ్రి సుబ్బన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రొద్దుటూరు : అక్రమంగా రవాణా చేస్తున్న 100 రేషన్ బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యం బస్తాలను ప్రభుత్వ గోదాముకు తరలించారు. మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామం వద్ద కోల్డ్ స్టోరేజ్ సమీపంలో మంగళవారం చెర్ల వెంకటేష్ అనే వ్యక్తి ప్లాస్టిక్ సంచుల్లో అక్రమంగా తరలిస్తున్న 4300 కేజీల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేశారు. దాడుల్లో డీటీ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

'కీచకుడి'పై సుదీర్ఘ విచారణ

కడప రూరల్ : ఆ శాఖలో..కీచకుడు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. విచారణకు ఆదేశించారు. సోమవారం జిల్లా మలేరియా అధికారి మనోరమ నేతృత్వంలో మొత్తం ఐదురుగురు మహిళా ఉద్యోగులు, బాధిత మహిళా ఉద్యోగినిని విచారించారు. ఆమె తన వద్ద ఉన్న ఫోన్ వాయిస్ రికార్డుతో పాటు ఇతర ఆధారాలను అన్నింటిని సమర్పించారు. వేధింపులకు గురి చేస్తున్న, ఫోన్‌లో రికార్డ్ అయిన సీనియర్ అసిస్టెంట్ మాటలను, విచారణ చేస్తున్న మహిళా ఉద్యోగులు విని విస్తుపోయారు. ఇందుకు సంబంధించిన అంశాలను బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

మట్టి ట్రాక్టర్, జేసీబీ పట్టివేత

పెండ్లిమర్రి : మండలంలోని గొందిపల్లె గ్రామ పొలాల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం మైనింగ్ ఆర్ఐ విమలమ్మ ఆధ్వర్యంలో దాడులు చేసి ఒక మట్టి ట్రాక్టర్, జేసీబీ మిషన్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాటిని పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌కు తరలించామని ఆమె తెలిపారు.

ఖాకీలకు చెంపపెట్టు!



- వర్రా రవీంద్రారెడ్డి కేసులో పోలీసులకు హైకోర్టు అక్షింతలు
- అధికార పార్టీ నేతల మెప్పు కోసం పోలీసులు అత్యుత్సాహం
- నవంబర్ 8న అదుపులోకి తీసుకుని 11వ తేది అర్ధరాత్రి మెజిస్ట్రేట్ ముందు హాజరు
- హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన వర్రా రవీంద్రారెడ్డి సతీమణి
- కేసు విచారణలో అధికారుల తీరుపై మండిపడ్డ న్యాయమూర్తి

సాక్షి ప్రతినిధి, కడప : 'ప్రజల మాన, ప్రాణ, ఆస్తులు కాపాడేందుకు రక్తాన్నైనా చిందిస్తాం'. ఇది ఒకప్పుడు పోలీసుల అంకితభావం. అందుకు చిహ్నంగా పోలీసు స్టేషన్ గోడలకు ఎర్ర రంగు వేసేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. అక్రమార్జన కోసం అడ్డదారులు ఎంచుకున్నారు. పోస్టింగ్ కోసం రాజకీయ నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వెరసి చట్టం అధికార పార్టీకి చుట్టంగా మారుతోంది. మెప్పు కోసం, రాజకీయ నేతల ప్రాపకం కోసం పోలీసు అధికారులు వేస్తున్న తప్పటడుగులు న్యాయస్థానం ఆగ్రహానికి గురి కావాల్సి వస్తోంది. సోషల్ మీడియా యాక్టివిస్టు వర్రా రవీంద్రారెడ్డి కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు తాజాగా వారినే బోనులో నిలబెట్టే స్థితికి చేరుకుంది. అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురిచేసి రెండు రోజుల తర్వాత కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసుల మెడపై ఇప్పుడు హైకోర్టు కత్తి వేలాడుతోంది.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టాడంటూ వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు ఆధారాలతో సహా బహిర్గతం కావడంతో ఇప్పుడు పోలీసులు బోనులో నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. వాస్తవానికి గత ఏడాది నవంబర్ 8వ తేదీన వర్రా రవీంద్రారెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు 11వ తేదీ అర్ధరాత్రి మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఇదే అంశాన్ని వర్రా రవీంద్రారెడ్డి మెజిస్ట్రేట్ ముందు చెప్పడంతో పాటు తనను కర్నూలు డీటీసీలో రెండు రోజులు ఉంచి చిత్రహింసలకు గురిచేసి బలవంతంగా తమకు అనుకూలంగా స్టేట్‌మెంట్ రికార్డు చేయించుకున్నారని స్పష్టం చేశారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా పుల్లూరు టోల్ గేట్ వద్ద 8వ తేదీన పోలీసుల అదుపులో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్ బయటకు రావడంతో పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టు సీరియస్ అయింది.

మొదటి నుంచి అత్యుత్సాహం..

సోషల్ మీడియా కేసులో వర్రా రవీంద్రారెడ్డిపై పోలీసులు మొదటి నుంచి అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. పైనుంచి వచ్చిన ఆదేశాలంటూ వర్రా రవీంద్రారెడ్డిని కడప తాలూకా స్టేషన్ వద్ద అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించగా అతను తప్పించుకున్నాడు. ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక శ్రద్ధతో ఉన్న ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం చేశారని ప్రభుత్వం ఓ ఎస్పీనే బదిలీ చేసి, మరో సీఐపై చర్యలు తీసుకుంది. ఆ తర్వాత నవంబర్ 8వ తేదీన వర్రాను అదుపులోకి తీసుకున్న పోలీసులు కర్నూలు డీటీసీకి తీసుకెళ్లారని ఆరోపణ. అక్కడ అతన్ని చిత్రహింసలకు గురిచేశారని అతనితో పాటు ఉన్న వ్యక్తులు కుటుంబ సభ్యులకు చెప్పారు. వర్రా రవీంద్రారెడ్డి సతీమణి కళ్యాణి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఆపై అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా, వర్రా రవీంద్ర కూడా ఇదే అంశాన్ని మేజిస్ట్రేట్‌కు చెప్పాడు. ఆధారాలు కూడా సేకరించి హైకోర్టు ముందుంచాడు. విచారణ చేపట్టిన జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం తప్పుడు అఫిడవిట్లు సమర్పించడంపై సీరియస్ అయింది. విచారణ అనంతరం పోలీసుల అధికారులపై కోర్టు తీవ్ర చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అధికార పార్టీ నేతలు చెప్పారంటూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న ఆ అధికారులు ఇప్పుడు మూల్యం చెల్లించక తప్పేట్లు లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పోలీసులు తప్పుడు అఫిడవిట్లు సమర్పించారు



పోలీసు అధికారులు చట్ట విరుద్ధంగా ప్రవర్తించారు. నవంబర్ 11న అదుపులోకి తీసుకున్నట్లు స్వయంగా కర్నూల్ రేంజ్ డీఐజీ మీడియాకు చెప్పారు. పూర్తి అబద్ధాలు మీడియాకు వెల్లడించారు. కర్నూల్ జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏపీ04బీకే 4055 కారులో వస్తుండగా నవంబర్ 8వతేదీ అదుపులోకి తీసుకొని వర్రా రవీంద్రారెడ్డిని చిత్రహింసలు పెట్టారు. పోలీసులు అక్రమ నిర్బంధంలో పెట్టుకున్న విషయాన్ని తెలుసుకొని అప్పట్లో హెబియస్ కార్పస్ పిటిషన్ హైకోర్టులో వేశాము. కేసు విచారణలో పోలీసు అధికారుల తీరును, తప్పుడు రికార్డులు సమర్పించిన వైనంపై హైకోర్టు సీరియస్ అయింది. హైకోర్టు తీర్పు తప్పుడు కేసుల వైపు మొగ్గు చూపే అధికారులకు చెంపపెట్టుగా నిలుస్తుందని భావిస్తున్నాం. – వర్రా కళ్యాణి, పులివెందుల

తప్పుడు స్టేట్‌మెంట్ కోసం చిత్రహింసలు



హైదరాబాద్ నుంచి వర్రా రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ఉదయ్ ముగ్గురు కారులో కడపకు వస్తుండగా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆపై రెండు రోజులు చిత్రహింసలకు గురి చేశారు. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని, పోలీసులు సూచించినట్లుగా చెప్పాలని థర్డ్ డిగ్రీకి పాల్పడ్డారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పీఏ రాఘవరెడ్డి చెప్పడంతోనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్లు చెప్పాలని చిత్రహింసలు పెట్టారు. అప్పట్లో హెబియస్ కార్పస్ పిటిషన్ కారణంగా హైకోర్టు ఆదేశాల మేరకు అరెస్టు చూపారు. తాజాగా హైకోర్టు విచారణలో వాస్తవాలు బహిర్గతమవుతున్నాయి. తప్పుడు చర్యలకు పాల్పడుతున్న పోలీసులకు న్యాయస్థానంలో శిక్ష తప్పదు. – ఓబుళరెడ్డి, న్యాయవాది, పులివెందుల

బినామీల లబ్ధికే విద్యుత్ ఒప్పందం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


నాయకులతో మాట్లాడుతున్న గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : విద్యుత్ యూనిట్‌కు రూ. 4.60 చొప్పున ఒప్పందం చేసుకోవడం ప్రజలపై పెనుభారమవుతుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన బినామీల లబ్ధి కోసమే ఇలాంటి అవినీతి ఒప్పందాలకు తెగబడ్డారని ఆరోపించారు. దేశ విద్యుత్ రంగ చరిత్రలో కనీవినీ ఎరుగని స్కామ్ ఇదే అన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సెకీ ద్వారా యూనిట్ రూ. 2.49కి కొనుగోలు ఒప్పందం చేసకుంటే కూటమి పార్టీలు గగ్గోలు పెట్టాయన్నారు. రూ.2.49 కే ఖజానాకు నష్టం జరిగిందని నానా యాగీ చేసిన నాయకులు తాజాగా యాక్సిస్ పవర్ నుంచి రూ.4.60 కి ఒప్పందం చేసుకుని, జీఓ కూడా విడుదల చేశారన్నారు. పైగా 25 ఏళ్లపాటు ధర తగ్గించేందుకు వీల్లేకుండా ఒప్పందంలో సీలింగ్ షరతు విధించి, కాంట్రాక్టర్ల ఆదాయానికి రాజమార్గం చూపించారన్నారు.

చంద్రబాబు హయాంలో గాడి తప్పిన విద్యుత్ రంగాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికా బద్ధమైన చర్యలతో అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. డిస్కంలకు 2019–2024 మధ్య ఏకంగా రూ.47,800 కోట్లు చెల్లిస్తే 2014–19 మధ్య టీడీపీ సర్కారు రూ.13,255.76 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ బకాయిలు రూ.8,845 కోట్లు ఇవ్వలేదన్నారు. వాటిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. జగన్ పాలనలో రెండు లక్షలకు పైగా అగ్రికల్చరల్ డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారని తెలిపారు.

చంద్రబాబు 39 సోలార్ పీపీఏలు 25 ఏళ్ల కాలపరిమితితో చేసుకున్నారన్నారు. మూడేళ్లకోసారి ధరలు పెంచేలా ఒప్పందం చేసుకుని ప్రజల నెత్తిన అప్పుల భారం మోపారన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచనని హామీ ఇచ్చి, ఇప్పుడు ప్రజలపై ఏకంగా రూ. 15 వేల కోట్ల భారం మోపారన్నారు.

సమావేశంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, సీనియర్ నాయకులు శ్రీరాములు, మస్తాన్, ప్రభాకర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్.. వెల్లాల వేడుక చూద్దాం..

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


వెల్లాలలోని శ్రీసంజీవరాయస్వామి

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు 8న గురువారం నుంచి 16వ తేదీ శుక్రవారం వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా 9న కల్యాణోత్సవం, 11న హనుమంతోత్సవం, 12న గరుడోత్సవం, 14న రథోత్సవం (తిరునాల) కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి తెలిపారు. 12న సోమవారం రాత్రి నటరాజ కళాక్షేత్రం ప్రొద్దుటూరు వారిచే సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని భక్తులే కాక ఇతర దేశాల నుంచి భక్తులు కూడా వచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని వారు తెలిపారు. అలాగే తిరునాల రోజు బుధవారం న్యాయవాది శ్యామ్‌సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మినరసింహ స్వామి కల్యాణ మండపంలో అక్కడకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

14న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

14వ తేదీ బుధవారం రథోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండవ, మూడవ, నాల్గవ బహుమతులుగా రూ.1,11,000, రూ.75,000, రూ.50,000, రూ.10,000 మిగిలిన ఎడ్లకు ప్రోత్సాహక బహుమతుల కింద రూ.5 వేలను అందజేస్తామన్నారు.

ఉత్సవ కార్యక్రమాలు

8న ధ్వజారోహణం, 9న కల్యాణం, శేష వాహనం
10న సింహ వాహనం, 11న హనుమంతోత్సవం
12న గరుడోత్సవం, 13న గజ వాహనం
14న రథోత్సవం (తిరునాల), 15న అశ్వ వాహనం
16న హంస వాహనం, ధ్వజావరోహణం

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


అల్తాఫ్‌హుస్సేన్(ఫైల్)

మైదుకూరు : మైదుకూరు ఇండస్ట్రియల్ హబ్‌లోలోని ఓ ప్రైవేటు గోదాములో కరెంటు పని చేస్తూ విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ గా పనిచేస్తున్న షేక్ అల్తాఫ్ హుస్సేన్ (28) మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరులోని సర్వాయ పల్లె రోడ్డు కు చెందిన షేక్ అల్తాఫ్ హుస్సేన్ దువ్వూరు మండలం గుడిపాడు లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో షిఫ్ట్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. విధులు లేని సమయంలో తన పెదనాన్న కుమారుడు కరీముల్లా తో కలిసి ప్రైవేట్ గా కరెంటు పనులు చేస్తుంటాడు. మంగళవారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ముక్కొండ వద్ద ఉన్న ఇండస్ట్రియల్ హబ్ లో శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తికి చెందిన విత్తన గోదాము లో కరీముల్లా మరికొందరితో కలిసి అల్తాఫ్ హుస్సేన్ కరెంటు పనులు చేసేందుకు వెళ్లాడు. గోదాములో పనిచేస్తూ సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో అల్తాఫ్ హుస్సేన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతనితో పాటు పనిచేస్తున్న వారు అతన్ని హుటాహుటిన మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహాతో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అల్తాఫ్ హుసేన్‌ను పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనపై అల్తాఫ్ హుస్సేన్ కుటుంబ సభ్యులు మైదుకూరు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అర్బన్ ఎస్ఐ చిరంజీవి అల్తాఫ్ హుస్సేన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. కాగా మృతి చెందిన అల్తాఫ్ హుస్సేన్‌కు నందిమండలం గ్రామానికి చెందిన యువతి తో గత నెలలో నిశ్చితార్థం జరిగింది. జూన్ నెలలో వివాహం జరగాల్సి ఉండగా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడడంతో అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా సోమవారం అల్తాఫ్ హుస్సేన్ చిన్నాన్న అనారోగ్యంతో మృతి చెందారు. ఆ బాధలో ఉన్న అతని కుటుంబంలో పెళ్లి కావాల్సిన యువకుడి మృతి మరింత విషాదాన్ని నింపింది.

దేవా.. దీవించవా..!

- ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- పెద్ద ఎత్తున తరలి వస్తున్న భక్తులు


నరసంది వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు


అలరించిన నృత్య ప్రదర్శన

బ్రహ్మంగారిమఠం : 'దేవా.. దీవించవా'.. 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని కాపాడవయ్యా..' అంటూ భక్తులు బ్రహ్మంగారిని వేడుకున్నారు. బ్రహ్మంగారిమఠంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం తెల్లవారుజామున శ్రీ వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్ఠింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు.

వైభవంగా నరసంది ఉత్సవం..

రాత్రి నరసంది ఉత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నరసంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్నాథ శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి వీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఏర్పాటు చేసిన హరికథ అలరించింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన స్వామి మాలధారులు ఇరుముడి సమర్పించారు. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంభొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, వరదరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించండి

– డీఐజీ కోయ ప్రవీణ్

ప్రొద్దుటూరు క్రైం : ముఖ్యమైన పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కర్నూల్ రేంజి డీఐజీ కోయప్రవీణ్ తెలిపారు. మంగళవారం ప్రొద్దుటూరుకు వచ్చిన డీఐజీ డీఎస్పీ కార్యాలయంలో సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలతో సమీక్ష నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కార నిమిత్తం స్టేషన్‌కు వచ్చే పిటిషనర్లతో మంచిగా మాట్లాడాలన్నారు. వారి సమస్యలను ఓపిగ్గా విని వాటిని సానుకూల వాతావరణంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించరాదని తెలిపారు. ఇటీవల ఎంతో ధైర్యసాహసాలను ప్రదర్శించి కరుడుగట్టిన నేరస్తుడి వాహనాన్ని వెంబడించి అతన్ని పట్టుకున్న రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డిని డీఐజీ అభినందించారు. చోరీ కేసుల్లో అద్భుత ప్రతిభ కనబరచి దొంగలతో పాటు సొత్తును రకవరీ చేసిన త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి, సిబ్బందిని డీఐజీ ప్రత్యేకంగా అభినందించారు. సబ్‌డివిజన్‌లోని సమస్యల గురించి ప్రొద్దుటూరు డీఎస్పీ భావన డీఐజీకి వివరించారు. సమీక్షా సమావేశంలో కడప ఎస్పీ అశోక్‌కుమార్, సీఐలు సదాశివయ్య, రామకృష్ణారెడ్డి, బాలమద్దిలేటి, గోవిందరెడ్డి, దేవకుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నకిలీ సర్టిఫికెట్లు చూపి ఉద్యోగంలో చేరిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లికు చెందిన రాహుల్ 4 సంవత్సరాల క్రితం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా చేరాడు. అధికారులకు అనుమానం రావడంతో అతని సర్టిఫికెట్లు పరిశీలించారు. సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో డీఎంహెచ్ఓ కార్యాలయం అధికారుల ఫిర్యాదు మేరకు రాహుల్ పై చీటింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వడ దెబ్బకు గురై వ్యవసాయ కూలీ మృతి


జగ్గంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(ఫైల్)

పులివెందుల : పులివెందులలో మంగళవారం వడదెబ్బకు గురై వ్యవసాయ కూలీ మృతి చెందాడు. పులివెందుల పట్టణానికి చెందిన జగ్గంరెడ్డి ప్రభాకర్ రెడ్డి (53) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం కూడా వ్యవసాయ పనులకు వెళ్లాడు. వ్యవసాయ పనులు చేస్తుండగా శరీరంపై బొబ్బలు ఏర్పడి వడదెబ్బకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే స్థానికులు పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ప్రభాకర్‌రెడ్డి అప్పటికే మృతి చెందాడని చెప్పారు.

పాము కాటుతో డ్రైవర్..


మృతి చెందిన గజ్జల మల్లికార్జున

కొండాపురం : మండల పరిధిలోని గండికోట ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద మెగా కంపెనీలో క్యాంపర్ డ్రైవర్‌గా పని చేస్తున్న గజ్జల మల్లికార్జున(33) పాముకాటుతో మృతి చెందినట్లు కొండాపురం ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని ఎస్. తిమ్మాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున కొండాపురంలో గండికోట ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలో క్యాంపర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పంప్ హౌస్ పక్కన మూత్ర విసర్జన కోసం వెళ్లినప్పుడు కాలికి పాము కాటు వేసింది. వెంటనే తోటి సిబ్బంది కొండాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని సోదరుడు శివనాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..


మృతి చెందిన మహిళ

పోరుమామిళ్ల : ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మారెడ్డిపల్లెకు చెందిన లక్షుమ్మ(41) అక్కడికక్కడే మృతి చెందింది. బద్వేలు కోర్టుకు వెళ్లి బైక్‌పై తిరిగివస్తుండగా టిప్పర్ ఢీ కొట్టడంతో మహిళ మృతి చెందింది. బైక్‌పై ముగ్గురు ఉండగా ఇద్దరు సురక్షితంగా బయట పడ్డారు. ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

– ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వారు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని అంబవరం గ్రామ సమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఐదుగురు గాయపడిన సంఘటన జమ్మలమడుగు మండలంలో జరిగింది. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నర్సోజి కొట్టాల గ్రామానికి చెందిన రోడ్డ పెద్ద గంగయ్య, ఆవుల చిన్న దస్తగిరి ఇరువురు కలసి బైక్‌లో పెండ్లి పత్రికలను బంధువులకు ఇచ్చేందుకు ముద్దనూరుకు బయలుదేరారు. ఇదే సమయంలో సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన తలారి రామాంజనేయులు, తలారి రమాదేవి, తలారి లక్ష్మీదేవిలు ముగ్గురు కలసి ఒక బైక్‌లో పట్టణంలోని ఓ హోటల్‌లో పనులు చేసుకునేందుకు వస్తున్నారు. అంబవరం వద్ద ఇరువురి బైక్‌లు పరస్పరం ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో రోడ్డ పెద్ద గంగయ్య, ఆవుల చిన్న దస్తగిరి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన అవసరం

– జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని


కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

కడప అర్బన్ : చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి–యజమాని సమస్యలు, ఈ–శ్రమ్ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని పేర్కొన్నారు. కడపలోని న్యాయ సేవా సదన్‌లో అసంఘటిత కార్మికుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు ఈ–శ్రమ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు, వివిధ రంగాల అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.